RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 12 సంచిక : 332 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 4 జూన్ 2024 పేజీలు : 4 వెల : 2/-




## కౌంటింగ్ ముగిశాక తెలంగాణ రాజకీయాల్లో...

# ఇక సంచలనాలే...!

హైదరాబాద్ : సార్వత్రిక సమరం ముగియడంతో ఇప్పుడు అంతా స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులపై ఫోకస్ పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిమందికి నామినేటేడ్ పదవులు వరించినా, ఇంకా భర్తీ చేయాల్సిన పోస్టులు చాలానే ఉండటం.. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో ద్వితీయ, తృతీయశ్రేణి నేతలు పదవుల కోసం తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు..** పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు చాలామంది గ్రామ, మండలస్థాయి నేతలు ఇతర పార్టీల్లోకి వలస వెళ్లగా, పార్లమెంట్ ఎన్నికల తర్వాత కూడా రాజకీయ వలసలు కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు పార్టీల మధ్య ముక్కోణ పోటీ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత ఏవైనా రెండు పార్టీల మధ్యే ఆధిపత్య పోరు కొనసాగనున్నందనే విశ్లేషణలు ఉన్నాయి. రాజకీయ భవిష్యత్ కోసం బలమైన పార్టీలోకి వలసలు.. దీంతో గ్రామ, మండల స్థాయి నేతలు తమ రాజకీయ భవిష్యత్ కోసం బలమైన పార్టీని ఎంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ నుంచి ఎవరూ బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీల్లో అత్యధిక స్థానాలు దక్కించుకునే పార్టీలోకి మిగిలిన పార్టీ నుంచి వలస పెరిగే పరిస్థితి కనిపిస్తోందంటున్నారు.

**తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ భిన్నమే..** తెలంగాణలో గ్రామ పంచాయతీల పదవీకాలం నాలుగు నెలల క్రితమే పూర్తయింది. వచ్చే నెలలో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం పూర్తికానుంది. దీంతో కొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానిక సంస్థల్లో గెలుపు అవకాశాలు ఉన్న పార్టీలను ఎంచుకుని ఆయా పార్టీల్లోకి వలస వెళ్లేందుకు గ్రామ, మండలస్థాయి లీడర్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల్లో గెలిచే అవకాశాలు కాస్త మెండుగా ఉంటాయి. కానీ, తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయని గత ఫలితాలు తెలియజేస్తున్నాయి.

**ఆసక్తి రేపుతున్న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు..** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించే పార్టీకి కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు ఎక్కువగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయంటున్నారు పరిశీలకులు.

దీంతో మూడు పార్టీల లీడర్లు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేని వారు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీగా పోటీకి అవకాశం దక్కని వారు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుంటున్నారు.

**లోక్‌సభ ఎన్నికల్లో చాంపియన్‌గా నిలిచే పార్టీకే ఎక్కువ మంది జైకొట్టే పరిస్థితి..** మొత్తానికి తెలంగాణలో రాజకీయ వలసకు ఇప్పుడప్పుడే బ్రేక్ పడేలా కనిపించడం లేదు.

స్థానిక ఎన్నికలు ముగిసేవరకు నేతల జంపింగ్‌లు కొనసాగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఐతే లోక్‌సభ ఎన్నికల్లో చాంపియన్‌గా నిలిచే పార్టీకే ఎక్కువ మంది నేతలు జైకొట్టే పరిస్థితి ఉన్నందున జూన్ 4 తర్వాత రాష్ట్రంలో ఏం జరగనుందనే ఉత్కంఠ రోజురోజుకు ఎక్కువవుతోంది.




## తెలంగాణ సచివాలయంలో వాస్తు మార్పులు.. ఎంట్రీ మారింది!

హైదరాబాద్ : తెలంగాణ సచివాలయంలో మార్పులు, చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇందులో భాగంగా సీఎం కాన్వాయ్ ఎంట్రీ ప్రధాన ద్వారాన్ని మార్చబోతున్నారని తెలుస్తోంది. ఇకపై సచివాలయం వెస్ట్ గేట్ (పశ్చిమ) నుంచి కాన్వాయ్‌కు ఎంట్రీ ఉండనుందట. ఈస్ట్ గేట్ నుంచి సీఎం కాన్వాయ్ బయటికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

అయితే.. ఐఏఎస్, ఐపీఎస్.. ఇతర అధికారులు మాత్రం ఈస్ట్ గేటు నుంచి ఎంట్రీ ఉంటుందని తెలియవచ్చింది. రేవంత్ సీఎం అయ్యాక తనదైన శైలిలో మార్పులు, చేర్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఈ మార్పుపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి.

అన్నీ సక్రమంగా ఉన్నా మార్పులు చేయాల్సిన అవసరమేంటి..? అని విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి. కాగా.. తొలుత పీసీసీ అధ్యక్ష పదవి వచ్చాక వాస్తుకు తగినట్లుగా గాంధీ భవన్‌లో మార్పులు చేసిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది.

## కోడ్ ముగియగానే కమిషన్, కార్పొరేషన్ పదవులు

హైదరాబాద్ : రాష్ట్రంలో పలు కీలకమైన కార్పొరేషన్లు, కమిషన్లకు చైర్మన్లను నియమించడంపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 37 కార్పొరేషన్లు, మరికొన్ని కమిషన్లకు చైర్మన్లను నియమించింది. తాజాగా మరో 15 నుంచి 20 కార్పొరేషన్లతో పాటు కొన్ని కమిషన్లకు చైర్మన్లను నియమించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. మరో వారంలో ఈ నియామకాలను పూర్తి చేయాలనే పట్టుదలతో రేవంత్‌ఉన్నట్టు పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఈ లోపు ఎలక్షన్ కోడ్ ( జూన్ 6 ) కూడా ముగియనుండడంతో ఆ వెంటనే ఆర్డర్ కాపీలను నేరుగా నేతలకు అందించనున్నారని తెలుపుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్లను త్యాగం చేసిన నాయకులకు ఈ నామినేటెడ్ పోస్టుల్లో టాప్ ప్రయార్టీ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో ఈ రెండు ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ నాయకులకు కూడా ఇందులో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలకు మాత్రం నామినేటెడ్ పదవులు ఇవ్వొద్దని సీఎం నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ నిబంధనల మేరకు వీరికి పదవులు ఇవ్వడం కుదరదని, తనను కలిసిన నాయకులకు రేవంత్ ఇప్పటికే స్పష్టం చేసినట్టు పీసీసీ వర్గాలు చెప్తున్నాయి.


**కీలక కార్పొరేషన్లన్నింటికీ చైర్మన్లు :** ఆర్టీసీ, సివిల్ సప్లయ్, బేవరేజెస్, రెడ్కో ( రెన్యువబుల్‌ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ), మూసీ రివర్ ఫ్రంట్, హుడా ( హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ) వంటి కీలక కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడంపై సీఎం రేవంత్ దృష్టిపెట్టారు. వీటితో పాటు విద్య, వ్యవసాయ రంగాలకు ఈసారి కొత్తగా కమిషన్లు



ఏర్పాటు చేసి, వాటికి అనుభవజ్ఞులైన వారిని చైర్మ న్లుగా నియమించాలని భావిస్తున్నారు. విద్యకు, వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఇందులో కొన్ని సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఈ రెండు శాఖలకు కమిషన్లను ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. విద్యా కమిషన్‌కు రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని, వ్యవసాయ కమిషన్ కు కాంగ్రెస్ సీనియర్ నేత, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిని నియమించనున్నారు. త్వరలో జిల్లా, మండల, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్నందున వాటిని దృష్టిలో పెట్టుకొని కూడా ఈ పదవుల పంపకంపై సీఎం ఫోకస్ పెట్టినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మొదటి విడతలో చాలా మంది సీనియర్లకు నామినేటెడ్ తో పాటు ఎమ్మెల్సీ , రాజ్యసభ వంటి కీలక పదవులు దక్కాయి. అప్పుడు ఆ పదవులు దక్కని మరికొందరు సీనియర్లను ఇప్పుడు మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ఈ పదవుల్లో నియమించనున్నారు.

**హుడా, మూసీ రిఫర్ ఫ్రంట్ కు చైర్మన్లు :** కరీంనగర్, వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థలకు మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం చైర్మన్లను నియమించింది. ఇప్పుడు హైదరాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ( హుడా )కి చైర్మన్?ను నియమించాల్సి ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్నందున ఇది కూడా చాలా కీలకమైన పదవే. అందుకే ఈ పదవికోసం గ్రేటర్ పరిధిలోని పలు నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు పైరవీలు చేస్తున్నట్టు సమాచారం. ఈ పదవి ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ సిటీ నేతల్లో నెలకొంది. ఇక మూసీ రివర్ ఫ్రంట్ చైర్మన్ పదవి కోసం కూడా గ్రేటర్ నేతలు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూసీ నది ప్రక్షాళన చేస్తామని ప్రకటించడంతోపాటు లండన్ లో పర్యటించి అక్కడ అధ్యయనం చేసి వచ్చారు. త్వరలోనే మూసీని ప్రక్షాళన చేయడంతో పాటు వందల కోట్లు ఖర్చు చేసి మూసీ పరీవాహక ప్రాంతాలను సుందరంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దీంతో ఇప్పుడు మూసీ చైర్మన్ పదవి కూడా చాలా కీలకం కానుంది. ఎన్నికల కోడ్ ముగిసేలోపు నామినేటెడ్ నియామకాలను ఫైనల్ చేసి, ఆ తర్వాత ఇక పూర్తిస్థాయిలో పాలనపై దృష్టి పెట్టేందుకు రేవంత్ సిద్ధమవుతున్నారు.

# లెక్కలు తప్పాయ్!




## మూడు పార్టీల్లో ఎగ్జిట్ పోల్ టెన్షన్.. ఎగ్జాక్ట్ పోల్స్ కోసం వెయిటింగ్!

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల అంచనాలపై మూడు పార్టీలకూ వాటికంటూ ప్రత్యేక లెక్కలు ఉన్నాయి. కానీ ఆ లెక్కలకు భిన్నంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడడంతో క్లారిటీకి బదులుగా కన్ఫ్యూజన్ నెలకొన్నది. అంచనా తప్పి తక్కువ సీట్లు వస్తాయనుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు ఆ రెండింటికంటే ఎక్కువ గెలుస్తామనుకునే బీజేపీ కూడా డైలమాలో పడింది. ఒక్కో జాతీయ టీవీ చానెల్ ఒక్కో తీరులో వెల్లడించాయని, ఇక సర్వే సంస్థలు కూడా పొంతనలేకుండా ఇచ్చాయనే అభిప్రాయంతో పొలిటికల్ లీడర్లు గందరగోళంలో పడ్డారు. గత ఎన్నికల (2019 లోక్‌సభ) సందర్భంగా వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో తాజా వివరాలను పోల్చి చూసుకుంటున్నారు. ఇప్పుడు వెలువడిన అంచనాల్లో ఏ మేరకు శాస్త్రీయత ఉన్నదో, ఎక్కడ పొరపాటు జరిగే అవకాశం ఉన్నదో విశ్లేషించుకుంటున్నారు. సీట్ల సంఖ్యకంటే ఓట్ షేర్ మీదనే వారు ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు.

**ఎగ్జాక్ట్ పోల్స్ భిన్నంగా ఉంటాయంటూ ధీమా....** కనీసంగా తొమ్మిది చోట్ల గెలుస్తామని, మ్యాగ్జిమమ్‌గా 13 వరకూ వెళ్తామని కాంగ్రెస్ ఇప్పటికీ ధీమాతో ఉన్నది. స్వయంగా సీఎం రేవంత్ (పీసీసీ చీఫ్ కూడా) మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంశాన్ని ప్రస్తావించకుండా ఎవరెన్ని లెక్కలు చెప్పినా మా అంచనాలు మాకున్నాయ్... అంటూ కాన్ఫిడెన్సును వెల్లడించారు. బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ఎంపీ లక్ష్మణ్ సైతం ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు మించి వాస్తవ ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్ర లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ సైతం అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఎగ్జిట్ పోల్ అంచనాలతో సంబంధం లేకుండా ఎగ్జాక్ట్ రిజల్టు భిన్నంగా ఉంటుందన్న ధీమాతో ఉన్నారు. ఎగ్జిట్ పోల్ లెక్కలతో ఇప్పుడు గాభరా పడాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు.

**ఓట్ షేరింగ్‌పైనే ఎక్కువ ఫోకస్...** తాజాగా వెలువడిన ఎగ్జిట్ పోల్స్ గురించి ఓ కాంగ్రెస్ నేత తన సన్నిహితులతో భిన్నమైన అభిప్రాయాన్ని షేర్ చేసుకున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాల్లో గెలిచినా 41.29% ఓట్ షేర్ పొందిందని, దాదాపు 77 లక్షల ఓట్లు రాబట్టిందని, ఈసారి కేవలం 13% మాత్రమే ఓట్ షేర్ ఉంటుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడాన్ని తప్పుపట్టారు. ఒక్కసారిగా 28% మేర ఆ పార్టీ కోల్పోతుందా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరోవైపు గత ఎన్నికల్లో బీజేపీ నాలుగు సీట్లు గెల్చుకున్నా అది పొందింది 19.45% ఓట్ షేర్ మాత్రమేనని, ఈసారి ఏకంగా 43% పొందుతుందంటూ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడాన్ని కూడా తప్పుపట్టారు. కాంగ్రెస్‌కు గత ఎన్నికల్లో మూడు సీట్లు వచ్చినా 29.48% ఓట్ షేర్ వచ్చిందని, ఈసారి పది శాతం పెరిగి 39% వస్తున్నట్లు అంచనా వేసిందని, లెక్కల్లో చాలా తేడా ఉన్నదని తన అభిప్రాయాన్ని సన్నిహతులతో పంచుకున్నారు.

బీఆర్ఎస్ కోల్పోయిన ఓట్ షేర్‌లో బీజేపీ ఒకేసారి 23% కంటే ఎక్కువ పొందడం సాధ్యంకాని అంశమని అభిప్రాయపడ్డారు. గతేడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయినా కేవలం రెండు శాతం లోపు ఓట్ షేర్ మాత్రమే తేడా ఉన్నదని, ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భారీ స్థాయిలో లూజ్ అయ్యే పరిస్థితులు లేవని వ్యాఖ్యానించారు. ప్రజల నాడి పసిగట్టడంలో సర్వే సంస్థలు విఫలమయ్యాయని, శాస్త్రీయత లోపించిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 19.45% ఓట్ షేర్ వచ్చినా దానికి ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు శాతం లోపే ఓట్లు పొందగలిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అప్పుడు 19 సీట్లలో మాత్రమే గెలిచినా ఓట్ షేర్ మాత్రం 34% దాటిందని ఉదహరించారు. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు దాదాపు 47% ఓట్ షేర్ ఉన్నదని, లోక్‌సభ ఎన్నికల్లో 41% పొందగలిగిందన్నారు.

**వాస్తవ ఫలితాలపైనే ఆశలన్నీ..** ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పరిగణనలోకి తీసుకున్నా విశ్లేషణ తర్వాత మాత్రం ఈ మూడు పార్టీల నేతలు భిన్నమైన తీరులో స్పందించారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చాలా జాతీయ టీవీ చాన్ళ్లు, సర్వే సంస్థలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఒకటి చొప్పున మాత్రమే వస్తాయని అంచనా వేశాయని, బీఆర్ఎస్‌కు 12–15 మధ్య వస్తాయని లెక్కలు చెప్పాయని పలువురు పొలిటీషియన్లు ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. కానీ వాస్తవ లెక్కలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయని, బీఆర్ఎస్‌కు 9, బీజేపీకి 4, కాంగ్రెస్‌కు 3 చొప్పున వచ్చాయని, ఈసారి కూడా అలాంటి తేడాలే ఉంటాయంటూ ఎగ్జిట్ పోల్స్ లెక్కలను లైట్ తీసుకున్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాలున్న బీజేపీ డజను లోక్‌సభ స్థానాలను గెల్చుకుంటే 64 స్థానాలున్న కాంగ్రెస్ ఎన్ని ఎంపీ సీట్లను గెల్చుకునే చాన్స్ ఉన్నదంటూ వారి మధ్య చర్చలు జరగడం గమనార్హం. ఆయా పార్టీలకు వాటివాటి లెక్కలు ఉండడం, గ్రౌండ్‌లో దాదాపు రెండు నెలల పాటు ఎలక్షన్ క్యాంపెయిన్ చేసిన తర్వాత ఏర్పడి స్పష్టత... వీటిని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు గుర్తుచేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ లెక్కలు ఎలా ఉన్నా తమకు చాలా క్లారిటీ ఉన్నదని, జూన్ 4న వచ్చే ఫలితాలు కచ్చితంగా భిన్నంగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ నేత తొమ్మిది సీట్లకు తగ్గే అవకాశమే లేదని భరోసా వ్యక్తం చేయగా, బీఆర్ఎస్ నేత మాత్రం ఒక్క సీటు కూడా డౌటేనంటూ ఎగ్జిట్ పోల్స్ పేర్కొనడాన్ని తోసిపుచ్చారు. వాస్తవ ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ ట్రాష్ అనే తీరులో వస్తాయన్నది వీరిద్దరి అభిప్రాయం.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## జాతీయ సర్వేలు వర్సెస్ ప్రాంతీయ సర్వేలు!

ఏపీలో ఎగ్జిట్ పోల్ సర్వేలలో ఏది నిజం అవుతుంది ఎవరికి పట్టం కడతారు అన్నది అతి పెద్ద చర్చగా మారుతోంది. జూన్ 1 సాయంత్రం ఆరున్నర నుంచి వెల్లువలా సర్వేలు వచ్చాయి. అయితే ఈ సర్వేలలో చూస్తే జాతీయ స్థాయి సర్వేలు అన్నీ కూడా ఎన్డీయేకు పట్టం కట్టాయి. అలా ఎన్డీయేలో భాగం అయిన ఏపీలో టీడీపీ కూటమికి కూడా భారీ ఆధిక్యతను ఇచ్చాయి. ఇక జాతీయ సర్వేలు అంచనాలు ఎలా ఉన్నాయంటే బీహార్ లో ఎల్ జేడీ పోటీ చేసిన సీట్ల కంటే ఎక్కువగా వస్తాయని ప్రకటించి నవ్వుల పాలు అయ్యాయి. అంతే కాదు తమిళనాడులో కూడా ఇదే తీరున అంచనాలు కట్టాయి. జాతీయ సర్వేలు బీజేపీ స్లోగన్ అయిన 400 సీట్లు అన్న దానిని పట్టుకుని దానికి దగ్గరగా నంబర్ ఇచ్చేందుకు ఆరాటపడ్డాయని అంటున్నారు. అయితే జాతీయ సర్వేల అంచనా తప్పు తమకు భారీగానే నంబర్ వస్తుందని ఇండియా కూటమి చెబుతోంది. మరో వైపు చూస్తే జాతీయ సర్వేలు లోక్ సభ ఎన్నికల్లో సక్సెస్ అయినట్లుగా అసెంబ్లీ ఎన్నికల్లో అయిన ట్రాక్ రికార్డు లేదు. పైగా జాతీయ సర్వే సంస్థలు ఆయా రాష్ట్రాల్లో ఏజెన్సీలకు కాంట్రాక్ట్ ఇచ్చి సర్వేలు జరిపిస్తూంటాయి. అలా కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థలు ఎన్ని శాంపిల్స్ కలెక్ట్ చేశాయి, ఎంత లోతులకు వెళ్ళి అధ్యయనం చేశాయన్నది కూడా సందేహాస్పదంగా ఉంటుందని అంటున్నారు. అదే సమయంలో ప్రాంతీయ సర్వేలు మాత్రం చాలా ఎక్కువగా జనంతో టచ్ లో ఉంటూ గ్రౌండ్ లెవెల్ రియాలిటీలను ప్రతిబింబిస్తాయని చెబుతున్నారు. అలా చూస్తే కనుక రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ సర్వేలు చెప్పిన ఎగ్జిట్ పోల్స్ మీదనే ఎంతో కొంత విశ్వసనీయత ఉంటుందని అంటున్న వారూ ఉన్నారు చాలా సందర్భాల్లో ప్రాంతీయ సర్వేల అంచనాలు నిజం అయ్యాయని గుర్తు చేస్తున్నారు. మరి ఏపీలో చూస్తే జాతీయ సర్వేలు ప్రాంతీయ సర్వేల మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఎన్డీయే గెలుపు అని చెబుతూ అన్ని చోట్లా కమల వికాసం అని చెబుతూ జాతీయ సర్వేలు ఇస్తున్న అంచనాలు ఏ మేరకు విజయవంతం అవుతాయన్నది చూడాల్సి ఉంది అంటున్నారు. ఇక ప్రాంతీయ సర్వేలు విజయవంతం కావడానికి కారణాలు వారు మాట్లాడే భాష ఒక్కటే కావడం, జనాల సెంటిమెంట్ వారి సమస్యలు వారి ఆలోచనలు జాతీయ సర్వేల కంటే ఎక్కువగా పసిగట్టగలవు అని అంటున్నారు. మరి ఈ విషయంలో పైపైన సర్వేలు చేసినా లేక వేరే ఎవరి మీదనో ఆధారపడి అంచనాలు వేసినా కూడా ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే ఏపీలో ఆరా మస్తాన్ సర్వేకు ఆత్మసాక్షి సర్వేకూ చాలా ప్రాధాన్యత ఉంది అని అంటున్నారు. ఈ రెండూ కూడా 2019 ఎన్నికల్లో వైసీపీ విజయాన్ని అంచనా వేశాయి. ఆరా మస్తాన్ అయితే 124 నుంచి 130 దాకా వైసీపీకి వస్తాయని కూడా చెప్పారు. ఇపుడు కూడా ఈ రెండు సంస్థలు వైసీపీ వైపు మొగ్గు చూపించడంతో టీడీపీ కూటమిలో ఒకింత కలవరంగా ఉంది అని అంటున్నారు. దీని మీదనే బుద్ధా వెంకన్న వంటి వారు కూటమి అధికారంలోకి రాకపోతే నాలిక తెగ్గోసుకుంటాను అని చెబుతున్నారు. ఈ విధంగా సవాల్ చేయడం వెనక చాలా అంశాలు ఉన్నాయని అంటున్నారు. జాతీయ సర్వేలు టీడీపీకి సంతోషాన్ని నింపుతూంటే ప్రాంతీయ సర్వేలలో ముఖ్యమైనవి వైసీపీ సైడ్ తీసుకోవడమే కొంత గందరగోళంగా ఉంది అని అంటున్నారు.

మరో వైపు చూస్తే సజ్జల రామకృష్ణారెడ్డి అయితే జాతీయ సర్వేలు ఎవరినో సంతోష పెట్టేందుకు ఇచ్చినట్లుగా ఉన్నాయని ప్రాంతీయ సర్వేలే గ్రౌండ్ లెవెల్ లో కొంత విషయాన్ని పట్టుకున్నాయని అంటున్నారు. చూడాలి మరి ఎవరి అంచనా నిజం అవుతుంది అన్నది జూన్ 4న ఫలితాలలో తేలనుంది.

# ఈ-సిగరెట్.. సరదాగా తాగినా చేటే!



హైదరాబాద్: నగర యువతలో ఈ-సిగరెట్ (ఎలక్ట్రానిక్ సిగరెట్) వినియోగం భారీగా పెరుగుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. సాధారణ సిగరెట్‌తో పోల్చితే ఇది ప్రమాదకరం కాదనే ధీమాతో చాలామంది ఈ-సిగరెట్‌ను అలవాటుగా చేసుకుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఏ సిగరెట్ తాగినా సరే...అనారోగ్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. గుండె వ్యాధులతోపాటు నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లకు ఈ-సిగరెట్లు కూడా కారణమేనని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వస్తున్న క్యాన్సర్ కేసుల్లో 25-30 శాతం పొగాకు సంబంధించినవేనని వైద్యులు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా 25-40 ఏళ్ల వయస్సులో యువత సైతం నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు. మే 31న పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం...

అత్యంత ప్రమాదం: సాధారణ సిగరెట్లలో 7 వేల రకాల రసాయనాలుంటాయి. వీటిలో 70 రకాల రసాయనాలు క్యాన్సర్ కారకాలు. పలు రసాయనాలు నేరుగా మనిషి దేహంపై ప్రభావం చూపుతాయి.

పొగకు బానిస అయితే... ఆ అలవాటు నుంచి బయటపడలేక ఎంతోమంది సతమతమవుతుంటారు. మరికొందరు ఈ-సిగరెట్ తాగేందుకు అలవాటు పడుతున్నారు. యువత కూడా.. ఇదో ఫ్యాషన్‌గా ఈ-సిగరెట్లకు అలవాటు పడుతున్నారు. తర్వాత తెలియకుండానే వీటికి బానిసలవుతున్నారు.

పబ్‌కల్చర్ పెరిగిన తర్వాత ఈ-సిగరెట్ వాడకం మరింత పెరిగింది. ఈ-సిగరెట్‌ను ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ సిస్టమ్(ఈఎన్‌డీఎస్) అని కూడా వ్యవహరిస్తారు. ద్రవరూపంలో ఉన్న నికోటిక్ సిగరెట్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరంలో ఉంటుంది. అందులో బ్యాటరీ అమర్చి ఉంటుంది. నోట్లో పెట్టుకొని పీల్చినప్పుడు బ్యాటరీ నికోటిన్‌ను మండిస్తుంది. సిగరెట్‌లా మండుతుంది. సాధారణ సిగరెట్ కంటే ఇందులో దీర్ఘంగా పీల్చే అవకాశం ఉంటుంది. దీంతో ధారాళంగా పొగ ఊపిరితిత్తులను చేరుతుంది. నికోటిక్ ఎక్కువగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, గుండెపోటు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. : పొగ తాగడం అనేది క్యాన్సర్‌కు దగ్గర దారి అని అపోలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ విజయానందరెడ్డి అన్నారు. నగరంలో పొగ తాగే వాళ్ల శాతం బాగా పెరుగుతోందన్నారు. : ఇంట్లో పొగ తాగే వారి కారణంగా మిగతా సభ్యులు కూడా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో భర్త లేదా భార్యలో ఎవరికి పొగతాగే అలవాటు ఉన్నాసరే...ఇతర కుటుంబ సభ్యులకు 30 శాతం కేన్సర్, 91శాతం గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ సురక్షితం కాదు

– డాక్టర్ శ్రీకృష్ణ రాఘవేంద్ర, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్, కామినేని హాస్పిటల్స్

ఈ-సిగరెట్లు సురరక్షితం కాదు. వాటితో ఊపిరితిత్తుల్లో వాపు ఏర్పడటం, ఇరిటేషన్లు కలగడం, కీలక అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీర్ఘకాలంలో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్లకు దారి తీస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధనలో.. ఈ-సిగరెట్లతో రక్తనాళాల పనితీరు దెబ్బతింటున్నట్లు తేలింది. గుండెవ్యాధుల ముప్పు పెరుగుతుంది. పొగతాగడం పూర్తిగా మానేయాలి. నికోటిక్ ఛూయింగ్‌గమ్, నికోటిక్ ప్యాచ్ వాడితే కొంత ప్రయోజనముంటుంది. దీనికితోడు సంకల్ప బలం, పట్టుదల ఉండాలి. ఇంకా మానలేకపోతే డీఅడిక్షన్ సెంటర్‌లో చేరి చికిత్స తీసుకోవాలి.

# చెల్లింపుల్లో జాప్యం.. పనులపై ప్రభావం



సారంగాపూర్ : మండలంలోని కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరతతో గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి'లో భాగంగా రూ.97 లక్షలతో పక్కా భవనం, మరో రూ.25లక్షలతో డైనింగ్ హాల్, ఇతర పనులు చేపట్టారు. కేవలం గుత్తేదారుకు రూ.30 లక్షల బిల్లులు మాత్రమే రావడంతో దాదాపు రెండేళ్లుగా పనులు కొనసాగిస్తూ ఇప్పుడిప్పుడే పనులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఎంపిక చేసిన సగానికి పైగా బడుల్లో పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. పాత పనులతోపాటు కొత్త పనులు పూరి చేస్తేనే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా పనిచేయనున్నాయి. సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యారంగాన్ని పటిష్ఠం చేసేందుకు గతం ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం ప్రారంభించగా.. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రెండేళ్ల కిందట జిల్లా వ్యాప్తంగా 274 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పారంభించగా నిధుల లేమితో సగానికి పైగా పాఠశాలలు అసంపూర్తి పనులతో నిలిచిపోయాయి. ఇందులో దాదాపు 28 పాఠశాలలు పనులు పూర్తి కావడంతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రారంభించారు. ఇందులో మరిన్ని పాఠశాలల పనులు పూర్తి కాగా ప్రారంభానికి సిద్ధం చేశారు. గతంలో ఎంపిక చేసిన బడులను మినహాయించి మిగతా పాఠశాలల్లో ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్), అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం నిధులతో పనులు జరుగుతున్నాయి. గత పథకంలో ఎంపికైన పాఠశాలలకు నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారులు అనేక చోట్ల పనులు నిలిపివేశారు. కొత్త పనులు కొనసాగుతుండడంతో పాత పనుల పురోగతిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యార్థులు చేరేనా? గతంలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలలను మూసివేశారు. మూతబడిన పాఠశాలలను ప్రభుత్వం తిరిగి తెరిపిస్తామనడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 పాఠశాలలను గుర్తించారు. గతంలోనే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ విద్యార్థులు రాకపోవడంతో మూసేయాల్సి వచ్చింది. ఒకే గ్రామంలో రెండు, మూడు పాఠశాలలు ఉండడం, గ్రామానికి ప్రైవేట్ పాఠశాలల బస్సులు రావడంతో విద్యార్థులు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం ఆయా పాఠశాలను తెరిపిస్తే విద్యార్థులు వచ్చే అవకాశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక వసతులతోపాటు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియామకం చేపట్టినప్పుడే ప్రభుత్వ పాఠశాలలకు మనుగడ ఉండనుంది.

రూ.31.49 కోట్లతో..

జిల్లాలో 788 ప్రభుత్వ పాఠశాలల్లో 4002 పనులు గుర్తించి రూ.31.49 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. ఇందులో 1818 పాఠశాలల్లో మూత్రశాల మరమ్మతుకు రూ.6.36 కోట్లు, తాగునీటి కోసం 724 పాఠశాలల్లో రూ.7.24 కోట్లు, చిన్నచిన్న మరమ్మతులు 461 పాఠశాలల్లో రూ.9.22 కోట్లతో చేపట్టనున్నారు. అలాగే 809 పాఠశాలల్లో రూ.2.02 కోట్లు, 57 పట్టణ పాఠశాలల్లో బాలికల మూత్రశాలల నిర్మాణానికి రూ.1.99కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని 133 పాఠశాలల్లో రూ.4.65 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకు అవసరమైనన మౌలిక వసతులు, బాలికల మూత్రశాలల నిర్మాణాలు, తాగునీటి అవసరాలు, మైనర్, మేజర్ మరమ్మతు పనులు, నిరుపయోగంగా ఉన్న మూత్రశాలల పునరుద్ధరణ, పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఇతర పనులు, సౌరశక్తి విద్యుత్తు పరికరాలు ఏర్పాటు, పాఠశాల యూనిఫాం తయారీపై వ్యయం చేయనున్నారు.

# ఈ నామ్‌కే వాస్తే!

హుజూరాబాద్ : వ్యవసాయ మార్కెట్‌లలో మోసాలను అరికట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ వ్యవసాయ విపణి(ఈ-నామ్) విధానాన్ని తీసుకొచ్చింది. కానీ ఎనిమిదేళ్లు దాటుతున్నా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఫలితంగా మార్కెట్‌లలో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల హవానే కొనసాగుతూ సేటు చెప్పిందే ధర అన్న చందంగా మారడంతో రైతులకు గిట్టుబాటు ధర లభించక నష్టపోతూనే ఉన్నారు.

ఎనిమిది విపణుల్లో.. కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ-నామ్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా 615 వ్యవసాయ మార్కెట్లను పరిధిలోకి చేర్చింది. కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర, గొల్లపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి, పెద్దపల్లి మార్కెట్లు ఈ-నామ్ పరిధిలో ఉన్నాయి కానీ.. పలు మార్కెట్లకు సాంకేతిక పరికరాలను సమకూర్చకపోవడంతో ఈ-నామ్ అమలుకు నోచుకోవడం లేదు. పంట ఉత్పత్తులకు మంచి ధర వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ మార్కెట్లలో ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేయకుండా వ్యాపారులు రైతుల దృష్టిని మళ్లిస్తున్నారు. ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేస్తే సమయానికి డబ్బులు అందవని, బ్యాంకు ఖాతాలో జమ చేస్తే రుణాల కింద రికవరీ చేస్తారని, అదే తమకు అమ్మితే వెంటనే డబ్బులు ఇస్తామని నమ్మబలుకుతున్నారు. ప్రస్తుతం పంట ఉత్పత్తులు వస్తున్నాయి. రైతులు మార్కెట్లకు రాగానే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రంగ ప్రవేశం చేసి తేమ శాతం ఎక్కువగా ఉందని ఆరబెట్టుకోవాలని చెబుతున్నారు. అలా రైతులను నాలుగైదు రోజులు మార్కెట్లలోనే ఉంచడంతో విసుగు చెంది ఎంతకో కొంతకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

కొనేది స్థానిక వ్యాపారులే.. ఈ-నామ్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పోటీ పడటం వల్ల రైతులు తాము ఆశించిన ధర కంటే ఎక్కువే వస్తుంది. మార్కెట్లను జాతీయ సర్వర్‌కు అనుసంధాన్న చేయకపోవడంతో స్థానిక మార్కెట్ల పరిధిలోని వ్యాపారులే సరకులను కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి గేట్ ఎంట్రీ, లాట్ నంబరు కేటాయింపు, బిడ్డింగ్ వంటి ప్రక్రియ చేపట్టాలి. విక్రయానికి వచ్చిన పంట ఉత్పత్తులను ప్లాట్‌ఫాంలపై కుప్పగా పోసి వాటి చిత్రాలు, వీడియోలు తీసి దేశవ్యాప్త సర్వర్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో వీక్షించే వ్యాపారులు సరకును ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారనే వివరాలను కోట్ చేస్తారు. బిడ్డింగ్ అనంతరం జరిగే డిక్లరేషన్‌లో ఏ వ్యాపారి ఎంత ధరకు ఏ సరకును కొనుగోలు చేశారనే వివరాలు తెలుస్తుంది కానీ.. ఇవేవీ లేకుండానే ఈ-నామ్ విధానానికి తూట్లు పొడుస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక వ్యాపారులతో ధర కుదిరిన రోజు రైతుల పంట వివరాలను సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వెంటనే స్థానిక వ్యాపారులతో ధరలు కోట్ చేయిస్తూ ఈ-నామ్ విధానంలో కొనుగోలు చేసినట్లు చూపిస్తున్నారు. పేరు జాతీయ వ్యవసాయ విపణి.. అమలయ్యేది మాత్రం స్థానిక ఈ-నామ్ విధానం అమలవుతోంది. రైతులు ఈ-నామ్ విధానంలోనే వ్యవసాయోత్పత్తులు అమ్ముకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నా ఇదెక్కడా అమలు కాకపోవడం గమనార్హం.

అమలైతే రెట్టింపు ఆదాయం

ఉమ్మడి జిల్లాలోని 39 వ్యవసాయ మార్కెట్లలో ప్రతీ సీజన్‌లో వందల కోట్ల రూపాయల విలువైన పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. వీటి ద్వారా మార్కెట్లకు ఆదాయం సమకూరుతోంది. 2023-24 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ల ఆదాయం రూ.86.94 కోట్లు సమకూరేలా లక్ష్యాన్ని నిర్దేశించగా.. నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించి రూ.96.21 కోట్ల ఆదాయం వచ్చింది. అదే ఎనిమిది మార్కెట్లలో ఈ-నామ్ విధానం పక్కాగా అమలైతే జీరో వ్యాపారానికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడి ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఉంది.

ప్రయోజనాలు ఇలా..మార్కెట్లలోని అన్ని విభాగాలను ఈ-నామ్ విధానంలో కంప్యూటరీకరిస్తారు.రైతులు పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తేగానే నాణ్యతను పరీక్షించి గ్రేడింగ్ వివరాలు, లాట్ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

ఇతర రాష్ట్రాలు, జిల్లాల వ్యాపారులు ఖరీదు చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు

కనీస మద్దతు ధరకు తక్కువ కోట్ చేయకుండా ఆన్‌లైన్‌లో ఏర్పాట్లు

నాణ్యత ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు ధరను కోట్ చేస్తారు. తద్వారా వ్యాపారుల మధ్య పోటీ పెరుగుతుంది. దేశంలోని ఏ వ్యాపారి ఎక్కువ ధర కోట్ చేస్తే వారికే పంట ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు అదే రోజు ఆన్‌లైన్‌లో రైతుల జరుగుతుంది.

# నిధులు మింగేసి.. నాలాలను వదిలేసి

హైదరాబాద్: రూ.వెయ్యి కోట్లతో నాలాల ఆధునికీకరిస్తామంటూ మూడేళ్ల క్రితం చేపట్టిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ)పై ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. నిధులు ఖర్చయినా బస్తీలు, కాలనీల్లో ముంపు ఆగట్లేదు. నాలాల పొడవునా జాలీలు లేక ఇటీవలే ఇద్దరు మృత్యువాతపడగా గురువారం వానతో రెండుచోట్ల నాలా గోడలు కూలిపోయి సమీప బస్తీలు, కాలనీలు నీట మునిగాయి. నాలా ఆక్రమణలను అడ్డుకోకపోతే ఇళ్ల మీదుగా వరద పోటెత్తుతుందని దిల్‌సుక్‌నగర్‌లో చోటుచేసుకున్న ఘటన స్పష్టం చేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో నగరంలోని వందల కిలోమీటర్ల నాలాలు కొద్దికొద్దిగా కుప్పకూలుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.రూ.985 కోట్లతో..: 2020 అక్టోబరులో భారీ వర్షంతో మహేశ్వరం, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని వందలాదికాలనీలు రెండు నెలలపాటు ముంపులో కొట్టుమిట్టాడాయి. దీంతో నాలాలను ఆధునికీకరించి కొత్తవాటినీ నిర్మిస్తామని జీహెచ్ఎంసీ రూ.985 కోట్ల పనులు చేపట్టింది. మరో రూ.2,500 కోట్లతో రెండోదశ పనులు చేపడతామని అప్పట్లో జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి



ప్రతిపాదనలు పంపింది. తొలుత చేపట్టిన పనులనే ఇంజినీర్లు పూర్తి చేయలేదు. పాతబస్తీలో పనులు ఎక్కడికక్కడ పడకేశాయి. సరూర్‌నగర్ చెరువుతో ముడిపడిన నాలా పనులు, ఇతర తటాకాల దిగువనున్న నాలాలు, హుస్సేన్‌సాగర్ వరద నాలా రక్షణగోడ పనులు నిధుల సమస్యతో అయోమయంలో పడ్డాయి.

ఆక్రమణలతోనే ముప్పు..

రెండు నాలా ప్రమాదాలకు నాలా ఆక్రమణలే కారణమన్న వాదన వినిపిస్తోంది. బంజారాహిల్స్ ఉదయ్‌నగర్ నాలాపై అనేక నిర్మాణాలతో వెడల్పు తగ్గిపోయింది. వరద తీవ్రతతో గోడలు కొట్టుకుపోయి, రోడ్డు కోతకు గురైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.


సరూర్‌నగర్ చెరువు వరద నాలా శంకేశ్వర్ బజార్ మీదుగా వెళ్లి మూసీలో కలుస్తుంది. శివగంగా థియేటర్‌వద్ద ఇటీవల నాలాపై ఓ నిర్మాణంతో విస్తీర్ణం తగ్గింది. ఎగువ నుంచి వరద ధాటికి రక్షణ గోడ తెగిపోయిందని స్థానికులు తెలిపారు.

# పెరిగిన గడువు.. అవకాశం మెరుగు

గోదావరిఖని : సింగరేణిలో ఉద్యోగ నియామకాలకు మరి కొంత మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడింది. మే 4 వరకు దరఖాస్తులకు చివరి గడువు విధించిన యాజమాన్యం తాజాగా జూన్ 4 వరకు పెంచింది. నెల రోజుల సమయం పెరగడంతో ఎక్కువ మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడింది. సింగరేణి సంస్థ మార్చి 14న ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 49, ఉద్యోగ కేడర్‌లో 278 ఖాళీలను భర్తీ చేసేందుకు నియామక ప్రక్రియను ప్రారంభించింది. దీనికోసం మార్చి 14న నోటిఫికేషన్ ఇచ్చిన యాజమాన్యం మే 4 వరకు గడువు ఇచ్చింది. ఎన్నికల నేపథ్యంలో దరఖాస్తులు చేసుకునేందుకు నిరుద్యోగులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణను యాజమాన్యం ఆన్‌లైన్‌లో నిలిపివేయడంతో నెల రోజుల పాటు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. దీంతో యాజమాన్యం జూన్ 4 వరకు గడువును పొడగించింది. నెల రోజుల పాటు సమయం ఇవ్వడంతో చాలా మంది నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. సింగరేణి ప్రాంతాల్లో చాలా మంది నిరుద్యోగులు ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్నారు. ఆయా విద్యార్హతలతోనే యాజమాన్యం ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. కొంత మంది ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ముందుగా ఇచ్చిన గడువు ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోగా ప్రస్తుతం గడువు పెంచడంతో వారికి సైతం అవకాశం లభించనుంది.

అధికారుల హోదా ఉద్యోగాలు 49

సింగరేణిలో అధికారుల హోదా కలిగిన ఉద్యోగ ఖాళీలు 49 భర్తీ చేయనున్నారు. ఇందులో ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సు పూర్తి చేసిన వారికి ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంటు ట్రైనీ హోదాలో 42



ఖాళీలను భర్తీ చేయనున్నారు. సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ ట్రైనీ ద్వారా ఏడు ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్ణయించారు. తాజాగా పెంచిన గడువుతో ఈ ఉద్యోగాలకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.సింగరేణిలో కింది స్థాయి ఉద్యోగుల కోసం ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొత్తం 278 ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్ణయించిన యాజమాన్యం ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ ద్వారా 100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ మెకానికల్ ట్రైనీ ద్వారా 9 మందిని, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ ట్రైనీ 24 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇక ఫిట్టర్ ట్రైనీ 47, ఎలక్ట్రీషియన్ ట్రైనీ 98 ఖాళీలను భర్తీ చేయనున్నారు. విద్యార్హత ఆధారంగా అభ్యర్థులు జూన్ 4న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకునే అవకాశం యాజమాన్యం కల్పించింది.

90 శాతం రిజర్వేషన్‌తో స్థానికులకు లాభం

కోల్‌బెల్టు ప్రాంతాలు విస్తరించి ఉన్న ఉమ్మడి నాలుగు జిల్లాలకు చెందిన నిరుద్యోగులతో 90 శాతం ఖాళీలను భర్తీ చేయనున్నారు. మిగతా 10 శాతం ఇతర ప్రాంతాల వారికి వర్తింపజేస్తారు. సింగరేణి విస్తరించి ఉన్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగులకు రిజర్వేషన్ వర్తిస్తుంది. దీంతో చాలా మంది నిరుద్యోగులకు అవకాశం లభించనుంది.

# జలమండలి వావ్!

హైదరాబాద్: నీటి ట్యాంకర్ బుక్ చేస్తే ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో.. రాదో తెలియని పరిస్థితి. ఇక నుంచి ఇలాంటి ఇబ్బందులకు జలమండలి చెక్ పెట్టనుంది. వాటర్ ఆన్ వీల్స్ (వావ్) పేరుతో కొత్త యాప్‌నకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం మాదాపూర్, సనత్‌నగర్, బంజారాహిల్స్ తదితర సెక్షన్ల పరిధిలో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. మరో 15 రోజుల్లో పూర్తిగా అందుబాటులోకి రానుంది.

బుకింగ్.. డెలివరీ ఇక సులువు

నీటి ట్యాంకర్ కావాలంటే ప్రస్తుతం వినియోగదారులు అష్టకష్టాలు పడుతున్నారు. జలమండలికి చెందిన వినియోగదారుల సేవా కేంద్రం నంబరు 155313కు ఫోన్ చేసి బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అనంతరం బుక్ అయినట్లు వినియోగదారుల సెల్ నంబరుకు సమాచారం పంపుతున్నారు. ఇప్పటివరకు వినియోగదారులు ట్యాంకర్‌ను ట్రాకింగ్ చేసే విధానం లేదు. ఫలితంగా అది ఎప్పుడొస్తుందో? ఎక్కడిదాక వచ్చిందో తెలియడం లేదు. కొన్నిసార్లు డ్రైవర్ ఫోన్ చేసినప్పుడు వినియోగదారులు ఫోన్ తీయకపోతే, ఏకపక్షంగా రద్దు చేస్తున్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి వాటర్ ఆన్ వీల్స్ యాప్ ప్రవేశపెడుతున్నట్లు జలమండలి రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్




తెలిపారు. ఫుడ్ డెలివరీ యాప్ మాదిరిగానే ఇది పని చేస్తుందని, స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడు చేసుకొని వినియోగించుకోవచ్చన్నారు. డబ్బులు సైతం యాప్ నుంచే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసినప్పుడే.. వరస సంఖ్య, డెలివరీ సమయం తదితర వివరాలు వినియోగదారులకు అందుతాయి. డెలివరీ సమయంలోనూ ఫోను చేస్తారు. ఇందుకోసం గ్రేటర్‌వ్యాప్తంగా ఫోన్ నంబరును అందుబాటులోకి తేనున్నారు. ఏకపక్షంగా ట్యాంకర్‌ను రద్దు చేసే సమస్య ఉండదు. ఈ యాప్ ద్వారా ఉచిత ట్యాంకర్లను సైతం బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది.

# పాఠ్య పుస్తకాలొస్తున్నాయ్

సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో డిసెంబరు నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా వీటిని సరఫరా చేసింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 3,73,746 పుస్తకాలు అవసరం ఉండగా, ప్రస్తుతం 1.2 లక్షల పుస్తకాలు బుధవారం వచ్చాయి. గత సంవత్సరం పంపిణీ చేయగా మిగిలినవి 5,846 ఉన్నాయి. మిగతా పుస్తకాలు జూన్ రెండో వారం నాటికి జిల్లాకు చేరుకుంటాయని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చిన పుస్తకాలను జిల్లా కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలోని గోదాంలో భద్రపరిచారు. జూన్ మొదటి వారంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా మండలాలకు పంపిణీ చేయనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు మండల విద్యాధికారులు అందజేయనున్నారు. జిల్లాలో 510 ప్రభుత్వ, 7 రెసిడెన్షియల్, 3 ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించే విధంగా విద్యాశాఖ అధికారులు సన్నద్ధం చేస్తున్నారు.

తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో...

గత విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి 9వ తరగతి వరకు ఒకే పుస్తకంలో ఓవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లం పాఠం ఉండేది. ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పుస్తకాలను కూడా ఇదే



విధంగా ముద్రించారు. మూడు నుంచి పదో తరగతి వరకు పార్ట్‌వన్, పార్ట్ టుగా పుస్తకాలు ఉన్నాయి. సిలబస్ ఆధారంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించేందుకు ప్రస్తుతం పార్ట్ వన్ పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ సిలబస్ నవంబర్ చివరి నాటికి ముగియనుంది. పార్ట్ టు పుస్తకాల్లోని సిలబస్ డిసెంబరు నుంచి ప్రారంభమవుతుందని, నవంబరు కంటే ముందు పార్ట్ టు పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. పాఠ్య పుస్తకాలలో ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలకు ప్రతి పాఠానికి బార్‌కోడ్ ఉంది. దీనిని చరవాణిలోని స్కానర్‌తో స్కాన్ చేస్తే ఆ పాఠాన్ని వీడియో ద్వారా చూడవచ్చు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ బుక్కులు కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

ప్రతి పుస్తకానికి నంబరు...

ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే ప్రతి పుస్తకంపైన నంబరు ముద్రించింది. ప్రతి పుస్తకం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే అందే విధంగా ఈ నంబరు ఉపయోగపడనున్నది. వీటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కాకుండా ఇతరులకు పంపిణీ చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసే సమయంలో పాఠశాలలోని స్టాక్ బుక్కులో విద్యార్థుల పేరుతో పాటు పాఠ్యపుస్తకాలపై ఉన్న నంబర్లను నమోదు చేసి విద్యార్థులకు అందించనున్నారు.

స్టాకు రిజిస్టర్‌లో నమోదు చేయాలి

బూస రాజేందర్, జిల్లా పాఠ్యపుస్తకాల ఇన్‌ఛార్జి మేనేజర్‌జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు అందజేస్తాం. జూన్ మొదటి వారంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆయా మండలాల మండల వనరుల కేంద్రాలకు అందజేస్తాం. అక్కడి నుంచి మండల విద్యాధికా రులు విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసే సమయంలో స్టాక్ రిజిస్టర్‌లో పుస్తకాల పైన ఉన్న నంబరును నమోదు చేయాలి.

# న్యాయమైన కోరికలు తీరుస్తా: మంత్రి పొంగులేటి

ఖమ్మం జిల్లా: పేదవారి ప్రభుత్వం వచ్చిన తరువాత రోహిణి కార్తె లోనే వర్షాలు కురుస్తున్నాయని, అనేక కష్టాలు, నష్టాలు పడి తనను మంచి మెజారిటీతో గెలిపించారని, మీరిచ్చిన అవకాశంతోనే తాను ఈస్థాయిలో ఉన్నానని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నేలకొండపల్లి మండలం, కొత్త కొత్తూరులో ప్రజల వద్దకే శ్రీనన్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పాలేరు నుంచి అత్యధిక మెజారిటీ రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆనాడు ఎన్నికల సభలో ప్రజలు అడిగిన కోరికలు నెరవేరుస్తానని మాటిచ్చానని, మీరు అడిగిన న్యాయమైన కోరికలు తీరుస్తానని మంత్రి పొంగులేటి అన్నారు. రాబోయే ఏడాది లోపే పాలేరులోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గడిచిన పదేళ్లలో పేదవారికి ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని, అర్హులైన వారికి ఆసరా పెన్షన్ కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని స్పష్టం




చేశారు. రూ. ఇరవై రెండున్నర వేల కోట్లు ఖర్చు పెట్టి ఇందిరమ్మ ఇళ్ళు కట్టిస్తామన్నారు. ప్రధాన ప్రతి పక్షం కల్లబొల్లి మాటలు మాట్లాడితుందని ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. పేదవారిని విస్మరించిన బీఆర్ఎస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సీట్లు వచ్చే పరిస్థితి లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# మందు పాతర పేలి వ్యక్తి మృతి



ములుగు జిల్లా: వాజేడు మండలంలో మందు పాతర పేలి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులే లక్ష్యంగా అమర్చిన మందు పాత్ర పేలి వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. వాజేడు మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లెందుల ఏసు(55) సోమవారం వంట చేరుకు నిమిత్తం కొంగాల అటవీ ప్రాంతంలోని గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందు పాత్రపై కాలు వేయటంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. దీంతో యేసు గాల్లోకి లేచి కిందపడి తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఏసుతో పాటు అతని కొడుకు రమేష్ మరో ముగ్గురు సైతం వంట చెరుకు కోసం వెళ్లారు. మిగిలిన నలుగురుకి ఎటువంటి గాయాలు కాలేదు గుట్ట దిగి కిందకి వచ్చి స్థానికులకు సమాచారం అందించడంతో స్థానికులు కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాగా పోలీసులు సంఘటన స్థలానికి ఇప్పటివరకు చేరుకోలేదు మృత మృతదేహాన్ని కిందకు తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, స్థానికులు జంకుతున్నారు .మందు పాత్రలు ఇంకా ఏమైనా ఉన్నాయేమో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సాంకేతిక శిక్షణ.. భవితకు నిచ్చెన




వికారాబాద్ : నేటి ఆధునిక సమాజంలో శాస్త్ర, సాంకేతిక కోర్సులకు, వృత్తి నిపుణులకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దితే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తోంది. జిల్లా కేంద్రంలో కొంపల్లి సమీపంలో పాలిటెక్నిక్ కళాశాలను 2009లో నెలకొల్పారు. జిల్లాలో ఇదొక్కటే పాలిటెక్నిల్ కళాశాల. ప్రైవేటులో కూడా లేవు. ప్రస్తుత సంవత్సరానికి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ చదువు పూర్తిచేసి ఉన్నత చదువులకు వెళ్తున్న వారి అభిప్రాయాలతో 'న్యూస్‌టుడే' కథనం.

మూడు కోర్సులు, 180 సీట్లు: ఈ కళాశాలలో సివిల్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రీషియన్ విభాగాల్లో కోర్సులున్నాయి. ప్రతిదాన్లో 60 సీట్లున్నాయి. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు 'పాలిసెట్'లో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు. ఇటీవల పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరిగింది. జిల్లాలో 1145 విద్యార్థులు రాశారు.

ఉపాధి, ఉద్యోగావకాశాలు ఎక్కువే..: పాలిటెక్నిక్ మూడేళ్ల కోర్సులో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఇస్తారు. మూడేళ్లు పూర్తి చేసిన విద్యార్థులకు నీటి పారుదల, ఎన్‌టీపీసీ, ఇంజనీరింగ్, రోడ్లు భవనాలు, ఎయిర్ లైన్స్ రైల్వే, మెట్రో, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఆర్మీ, నేవీ, బీహెచ్ఈఎల్, సింగరేణి వంటి ప్రభుత్వ రంగాల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇవే కాకుండా ప్రైవేటు, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. అంతే కాకుండా డిప్లొమా కోర్సుల అనంతరం ఇంజినీరింగ్ చేసే అవకాశం ఉంది.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యం: ఎం.పావనిశ్రీ

తల్లిదండ్రులతో కలిసి వికారాబాద్‌లో ఉంటాం. ఈ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కోర్సు పూర్తి చేశా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నా ఆశయం. ఈసెట్‌లో మంచి ర్యాంక్ సాధించా. బీటెక్ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధిస్తా.

స్టార్టప్ కంపెనీ నెలకొల్పుతా: జి.సాయితేజ

మాది కామారెడ్డి జిల్లా పిట్లం. వ్యవసాయ కుటుంబం. నాణ్యమైన బోధన కోసం వికారాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో చేరాను. సివిల్ ఇంజినీర్ కోర్సు ఈ సంవత్సరమే పూర్తి చేశాను. ఈసెట్‌లో ర్యాంక్ వచ్చింది. బీటెక్ పూర్తి చేసి స్టార్టప్ కంపెనీ నెలకొల్పుతా. ఇతరులకు ఉపాధి కల్పిస్తా.

ఏఐఎంఎల్ కోర్సులో చేరతా: జి.శ్రీజ

మేము వికారాబాద్‌లోనే ఉంటాం. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేశాను. బీటెక్‌లో ఇటీవల ప్రవేశ పెట్టిన కొత్త కోర్సు ఏఐఎంఎల్ కోర్సులో చేరాలనుకుంటున్నాను. బీటెక్ పూర్తి కాగానే ఎంటెక్ పూర్తి చేసి స్టార్టప్ కంపెనీ నెలకొల్పుతా.

చక్కటి అవకాశం, సద్వినియోగం చేసుకోండి

– ఎం.పరమేశ్వర్, ప్రిన్సిపల్, పాలిటెక్నిక్ కళాశాల

పాలిటెక్నిక్ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తక్కువ ఖర్చుతో చదువుకుని స్వయం ఉపాధి పొందడానికి ఈ విద్య ఉత్తమ మార్గం. ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలలో తరచుగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నాం. పలు కంపెనీల వారు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు.

# విద్యుత్తు 'మే'లుకొలుపు

హైదరాబాద్ : ప్రధాన నగరం మెట్రోజోన్ పరిధిలోకి వస్తుంది. హైదరాబాద్ సెంట్రల్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, పాతబస్తీ పరిధిలోకి వచ్చే హైదరాబాద్ సెంట్రల్ సర్కిళ్లు ఈ జోన్ పరిధిలో ఉన్నాయి. వీటి పరిధిలో 1213 వరకు 11కేవీ ఫీడర్లు ఉన్నాయి. అంతరాయాలకు సంబంధించి ఏటేటా పరిస్థితి మెరుగవుతుందా? దిగజారుతుందా ? తెలుసుకునేందుకు రెండేళ్ల డాటాతో ఉన్నతాధికారులు విశ్లేషించారు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు గతేడాది అంతరాయాలతో పోల్చితే.. ప్రతి నెలలోనూ తగ్గినట్లు గుర్తించారు. గత ఏడాది ఐదు నెలల కాలంలో 11కేవీ ఫీడర్లలో ట్రిప్పింగ్ కారణంగా 2950.37 గంటల సమయం అంతరాయాలు ఏర్పడితే.. ఈసారి అది 2001.49 గంటలకు తగ్గించగలిగారు. మేలో అనూహ్యంగా పెరిగాయి. ఈదురుగాలులతో పంపిణీ వ్యవస్థ వణికిపోయింది.

ఈ ఏడాది మార్చి నెల మొదట్లోనే ఎండలతో విద్యుత్తు డిమాండ్ పెరగడంతో డిస్కం అప్రమత్తమైంది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఆర్టిజన్ నుంచి ఎస్ఈ వరకు ఛార్జ్ మెమోలు జారీ చేయడం, సస్పెన్షన్లు చేయడంతో మిగతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈ ఫలితాలు మార్చి నెలలో కన్పించాయి.

మేలో తారుమారు జనవరి నుంచి ఏప్రిల్ వరకు అంతరాయాలను తగ్గించినప్పటికీ..మే నెలలో ఈదురుగాలులతో ట్రిప్పింగ్‌లు, బ్రేక్‌డౌన్లు పెరిగాయి. గత ఏడాది 1938 ఫీడర్లలో ట్రిప్పింగ్‌లైతే.. ఈసారి 1450 గంటలకు తగ్గాయి. అదే సమయంలో బ్రేక్‌డౌన్లు పెరిగాయి. గత ఏడాది మే నెలలో 255 బ్రేక్‌డౌన్లు తలెత్తితే.. ఈసారి ఆ సంఖ్య మూడింతలు పెరిగింది. 28వ తేదీ వరకు 695 ఫీడర్లలో బ్రేక్‌డౌన్లు వచ్చాయి. తీగలపై చెట్లు పడటంతో నెట్‌వర్క్‌కు నష్టం వాటిల్లింది.

అధిక ఉష్ణోగ్రతలు.. ఈదురుగాలులు.. ఆకాల వర్షాలతో మే నెల విద్యుత్తు సిబ్బందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. సాధారణంగా ఈ నెలలోనే ఎక్కువ ఫీడర్ల ట్రిప్పింగ్‌లు, బ్రేక్‌డౌన్లు తలెత్తుతుంటాయి. సిబ్బంది అప్రమత్తత, అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణతో మెరుగైన సరఫరాకు మెట్రోజోన్ అధికారులు కృషి చేస్తున్నారని చెబుతున్నారు. కరెంట్ పోవద్దంటే ఏంటి పరిష్కారం?

ఎండలకు, వానలకు, గాలులకు అంతరాయాలు ఏర్పడకుండా ఉండాలంటే భూగర్భ కేబుళ్లు వేయడం పరిష్కారమని టీజీఎస్పీడీసీఎల్ విశ్రాంత ఇంజినీర్లు అంటున్నారు. ఇందుకు రూ.10వేల కోట్లు అవుతుందని అంచనా వేశారు. నిధుల సమస్యతో వీటిని చేపట్టలేకపోతున్నారు. కేంద్రం ఏదైనా పథకం ప్రవేశపెడితే అడుగులు పడే అవకాశం ఉందని అంటున్నారు.

# అత్యవసర దందా

హైదరాబాద్: వర్షాకాల అత్యవసర బృందాల ఏర్పాటు పనుల్లో కొందరు జీహెచ్ఎంసీ ఇంజినీర్లు చేతివాటాన్ని ప్రదర్శించారు. బినామీ గుత్తేదారులకు కాంట్రాక్టులు అప్పగించాలన్న ఉద్దేశంతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అందుకోసం రూ.లక్షల్లో లంచం తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ ఏటా రూ.కోట్లు వెచ్చిస్తుంటే.. సహాయక చర్యలను నామమాత్రంగా చేపడుతున్న ఇంజినీర్లు ఖజానాకు కన్నం వేస్తున్నారు.

ఎవరెవరంటే..: వర్షాకాల సహాయక చర్యల కోసం ఈ నెల 24న కూకట్‌పల్లి సర్కిల్ ఇంజినీరు అయిదు డివిజన్లకు ఒక్కో టెండరు నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో రెండు డివిజన్ల పనులను ఆ ఇంజినీరు బినామీ గుత్తేదారుకు అడ్డదారిలో ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. దాంతో ఆయనకు పనులను అప్పగించలేదంటూ ఆ రెండు డివిజన్లకు గురువారం మళ్లీ టెండరు నోటిఫికేషన్ ఇచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా 29న జారీ చేసిన మూడు టెండర్ల నోటిఫికేషన్లను కూడా సర్కిల్ కార్యనిర్వాహక ఇంజినీరు ఎలాంటి కారణం లేకుండా రద్దు




చేసి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడం వివాదానికి దారితీసింది. ఈ విషయమై ఈఈ చిన్నారెడ్డిని వివరణ కోరగా నిబంధనల ప్రకారమే టెండర్లను రద్దు చేసి కొత్తగా పిలిచామని తెలిపారు.

చందానగర్ సర్కిల్ కోసం అయిదు నోటిఫికేషన్లకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పక్కనపెట్టి గురువారం మళ్లీ టెండరు నోటిఫికేషన్ ఇవ్వడంతో విమర్శలు వచ్చాయి. ఆ తప్పును దిద్దుకునేందుకు..ఉన్న టెండరు నోటిఫికేషన్లు అన్నీ రద్దు చేసి పాత నోటిఫికేషన్‌కు వచ్చిన దరఖాస్తులను ఆమోదించారు.

# పెరుగుతున్న ఇంధన వినియోగం

హైదరాబాద్: ఇంధన ధరలు భగ్గుమంటున్నా.. వినియోగంలో తగ్గేదేలేదంటున్నారు నగరవాసులు. గతేడాదితో పోల్చితే గ్రేటర్‌లో పెట్రోల్ 24శాతం, డీజిల్ వినియోగం 15శాతం పెరిగింది. పెట్రోల్‌లో హైదరాబాద్, డీజిల్ వినియోగంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉన్నాయి. ఒక్కో ఇంట్లో రెండుకు మించి వాహనాలు ఉండడంతో గ్రేటర్ జనాభాలో మూడు వంతులు వాహనాలు ఉన్నాయి. ఇందులో ద్విచక్ర వాహనాలే 70 శాతం ఉండగా, 19శాతం కార్లు ఉన్నాయి. ప్రతి నెలా 25వేల కొత్త వాహనాలు

నగరంలో ప్రతినెలా 25వేల కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ప్రజారవాణా వ్యవస్థలు అందుబాటులో ఉన్నా వ్యక్తిగత వాహనాల కొనుగోళు ఏటా పెరుగుతున్నాయి. గతంలో ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 30




లక్షల మంది ప్రయాణిస్తుండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 15లక్షలకు పడిపోయింది. ఎంఎంటీఎస్‌లో గతంలో 1.80లక్షల మంది ప్రయాణించగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 80వేలు మాత్రమే. మెట్రోలో రోజూ 5లక్షల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇందులో వ్యక్తిగత వాహనాలతో మెట్రో స్టేషన్ వరకు వచ్చేవారు ఉన్నారు. సదుపాయాలు పెరుగుతున్నా పూర్తిస్థాయిలో ప్రజా రవాణాపై ఆధారపడేవారు తగ్గుతున్నారు. ఫలితంగా ఇంధన వినియోగం పెరుగుతోంది.

# ముందుకు సాగని అమ్మ ఆదర్శ పనులు

సిరిసిల్ల : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. కనీసం నాలుగో వంతు కూడా పూర్తి చేయని పరిస్థితి ఉంది. దీంతో ఇప్పటిలోగా పూర్తయ్యే దాఖలాలు కనిపించడం లేదు. మరోవైపు పాఠశాలల పునఃప్రారంభ సమయం దగ్గర పడుతుంది. దీంతో వచ్చే విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులకు సమస్యలు తప్పేటట్లు లేవు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. దీనిలో భాగంగానే పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుపై దృష్టి సారించింది. కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో 309 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి మహిళా సంఘాల సభ్యులతో కమిటీలను నియమించారు. వీటిలో ప్రస్తుతం 260 పాఠశాలల్లో పనులు ప్రారంభించి 50 శాతం వరకు పూర్తి చేశారు. వీటిలో 46 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తయి రంగులు వేయడానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా వాటిలో పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వీటి పురోగతిపై కలెక్టర్ అనురాగ్ జయంతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నారు. జూన్ మొదటి వారంలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినప్పటికీ వేగవంతం కాని పరిస్థితి ఏర్పడింది.

కమిటీల ఆధ్వర్యంలో...జిల్లాలో 309 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 260 పాఠశాలల్లో మాత్రమే మౌలిక వసతుల కల్పన పనులు ప్రారంభించారు. ఈ పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించారు. ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులతో ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నారు. పాఠశాలలో పనులు ప్రారంభమైన తర్వాత రూ.25 వేల లోపు విలువైన పనులు చేసిన తర్వాత పాఠశాలలో కమిటీ సమావేశమై ఆ నిధులను విత్‌డ్రా చేయనుంది. ఇప్పటికే ఎంపికైన పాఠశాలల కమిటీల ఖాతాల్లో 20 శాతం మేరకు డబ్బులు జమ చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.జూన్ మొదటి వారంలో పూర్తి చేస్తాంజిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా 309 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో 260 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. ఇప్పటికే వాటిలో కల్పించాల్సిన మౌలిక వసతుల్లో 50 శాతం వరకు పనులు పూర్తి చేశాం.




## తాగి ఉన్నా.. మర్చిపోయా!: పుణె కారు ప్రమాద నిందితుడి సమాధానం

ముంబయి: దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచిన పుణె కారు ప్రమాద ఘటనలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడిని పోలీసులు విచారించారు. ప్రమాదం జరిగిన రోజు రాత్రి అసలు ఏమైందో అతడు గుర్తుకు తెచ్చుకోలేకపోయినట్లు సమాచారం. ఆ టీనేజర్ ప్రస్తుతం అబ్జర్వేషన్ హోంలో ఉన్నాడు. తాను మద్యం మత్తులో ఉండటంలో ఆరోజు ఏం జరిగిందో తనకు గుర్తు రావడంలేదని అతడు చెప్పినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు ఆ మైనర్ తన స్నేహితులతో కలిసి రెండు బార్లకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. తొలుత వెళ్లిన బార్‌లో నిందితుడు కేవలం 90 నిమిషాల్లోనే రూ.48వేల ఖర్చు చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. అక్కడి నుంచి మరో బార్‌కు వెళ్లి అక్కడ కూడా మద్యం తాగినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇంటికి వెళ్తుండగా ఓ బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు టెకీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతడిని మేజర్‌గా పరిగణించి దర్యాప్తు చేపట్టేందుకు అనుమతినివ్వాలని పోలీసులు ఇప్పటికే న్యాయస్థానాన్ని కోరారు. ఇదిలా ఉంటే.. బ్లడ్ టెస్ట్‌లో మద్యం ఆనవాళ్లు బయటపడకుండా ఉండేందుకు అతడి తల్లి రక్త నమూనాలు ఇచ్చినట్లు కూడా వెల్లడైంది. ఆమెతో పాటు కేసు విచారణను పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించిన బాలుడి తాత, రియల్టర్ అయిన తండ్రిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ ప్రమాదానికి సంబంధించి మూడు కేసులు నమోదు కాగా.. 100 మంది సిబ్బందితో కూడిన బృందాలు దర్యాప్తులో భాగమయ్యాయి.




లిస్బన్: దక్షిణ పోర్చుగల్‌లో జరుగుతున్న ఎయిర్‌షోలో ప్రమాదం చోటుచేసుకుంది. విన్యాసాలు ప్రదర్శిస్తున్న సమయంలో రెండు విమానాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ పైలట్ మృతిచెందగా.. మరో పైలట్ తీవ్రంగా గాయపడ్డారు. బెజాలో ఆదివారం జరుగుతున్న ఎయిర్‌షోలో ఈ ప్రమాదం జరిగింది. మొత్తం ఆరు విమానాలు విన్యాసాలు ప్రదర్శిస్తుండగా.. ఒకటి వేగంగా పైకి దూసుకెళ్లి మరోదాన్ని ఢీకొట్టింది. దీంతో రెండూ ఒక్కసారిగా కుప్పకూలాయి. ఒకటి ఎయిర్‌బేస్‌కు ఆవల పడగా.. మరొకటి సమీపంలో కుప్పకూలింది. విచారణ జరిపి ప్రమాదానికి దారితీసిన కారణాలేంటో గుర్తిస్తామని పోర్చుగల్ రక్షణమంత్రి నునో మెలో తెలిపారు. పోర్చుగల్, స్పెయిన్‌కు చెందిన పైలట్లతో కూడిన 'యాక్ స్టార్స్' అనే ఏరోబాటిక్ గ్రూప్ ఈ వైమానిక విన్యాసాలను ప్రదర్శిస్తోంది. వీటిలో పాల్గొన్న విమానాలన్నీ యాకోవ్లెవ్ యాక్-52 రకానికి చెందినవి. మరణించిన పైలట్ స్పెయిన్‌కు చెందిన వ్యక్తి కాగా.. గాయపడిన పైలట్ పోర్చుగల్ పౌరుడు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలను ఓ వీక్షకుడు తన కెమెరాలో బంధించి ఎక్స్‌లో పోస్ట్ చేయగా అది వైరలవుతోంది.




హైదరాబాద్: తెలంగాణ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మే 24న ఈ పరీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 82,809 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ ఫలితాలను విడుదల చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం జోరుమీదున్నాయి. ఉదయమే భారీ లాభాలతో ట్రేడింగ్ ప్రారంభించిన మార్కెట్లు అదే హవాను కొనసాగిస్తున్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ జీవనకాల గరిష్ఠాలను తాకాయి. దీంతో మదుపర్ల సంపద ట్రేడింగ్ ప్రారంభంలోనే రూ.12.50 లక్షల కోట్లు పెరగడం విశేషం. శనివారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో మరోసారి అధికార ఎన్డీయే కూటమిదే విజయమని ముక్తకంఠంతో అంచనా వేసిన విషయం తెలిసిందే. సూచీల పరుగుకు ప్రధాన కారణం ఇదే. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలు, రేట్ల కోత అంచనాలతో ఆసియా మార్కెట్ల ర్యాలీ, రూపాయి బలపడడం వంటి అంశాలు కూడా సూచీలను ముందుకు తీసుకెళ్తున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 76,738 దగ్గర, నిఫ్టీ 23,338 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్-30 సూచీలో ఒక్క హెచ్‌సీఎల్ టెక్ మినహా అన్ని షేర్లు లాభాల్లోనే ఉన్నాయి. పవర్‌గ్రిడ్ ఏకంగా 10 శాతానికి పైగా లాభపడడం విశేషం.

ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ ఎనిమిది శాతం లాభంతో ఉన్నాయి. ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్ ఆరు శాతం, అల్ట్రాటెక్ సిమెంట్, ఎం అండ్ ఎం ఐదు శాతానికి పైగా లాభంలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 12:32 గంటల సమయంలో సెన్సెక్స్ 2,335 పాయింట్లు ఎగబాకి 76,286 దగ్గర కొనసాగుతోంది. నిఫ్టీ 694 పాయింట్లు పెరిగి 23,225 వద్ద ట్రేడవుతోంది.




## తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్: తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. నాగర్‌కర్నూల్, గద్వాల్, నల్గొండలో ప్రవేశించడంతో పాటు రాష్ట్రంలో చురుగ్గా కదులుతున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారంలో తెలంగాణకు రుతుపవనాలు వస్తుంటాయి.

ఈ ఏడాది వారం రోజుల ముందే వీటి ఆగమనం జరిగింది. ఈసారి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉపరితల ఆవర్తనం కారణంగా సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని చెప్పారు. మంగళవారం నుంచి 3 రోజుల పాటు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు రావచ్చని తెలిపారు.




సీఎం రేవంత్ రెడ్డి ఎన్నడూ జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా సిద్దిపేటలోని భారాస కార్యాలయంలో ఆయన కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామ రక్ష అని కొనియాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పత్రికా ప్రకటనల్లోనూ ఎక్కడా 'జై తెలంగాణ' అని లేదన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ సోయిని మాయం చేస్తారని విమర్శించారు. రాష్ట్ర హక్కుల కోసం, ప్రయోజనాలకోసం పోరాడే ఏకైక పార్టీ భారాస మాత్రమేనన్నారు.

## జూన్ 4 వరకు ఆగండి.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారే: సోనియాగాంధీ



దిల్లీ: ఎగ్జిట్ పోల్స్ ఇచ్చిన అంచనాలకు ఎన్నికల ఫలితాలు విరుద్ధంగా ఉంటాయని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ ఆశాభావం వ్యక్తంచేశారు. అందుకోసం జూన్ 4 వరకు వేచిచూద్దామంటూ మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం ఎన్డీయే కూటమిదేనని ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించిన వెల్లడించిన సంగతి తెలిసిందే. "ఎన్నికల ఫలితాలపై మేం ఆశాభావంతో ఉన్నాం. జూన్ 4న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారవుతాయని భావిస్తున్నాం. ఆరోజు వరకు వేచి చూద్దాం" అని సోనియా అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. "ఇండియా కూటమి కార్యకర్తల స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు బోగస్ పోల్స్‌ను మోదీ ప్రచారంలోకి తెచ్చారు. ఇవి ఆయన ఊహల ఫలితాలు. మాకు 295 సీట్లు వస్తాయి" అని అన్నారు. "ఎగ్జిట్ పోల్స్ రాజకీయ అభిప్రాయాలే గానీ నిపుణుల ఫలితాలు కావు. నిజాలేమిటనేది 4న తెలుస్తుంది" అని హస్తం నేతలు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై భాజపా నేత ఒకరు మాట్లాడుతూ.. "ఊహల ప్రపంచంలో జీవించే వ్యక్తి అలాగే మాట్లాడతారు. అసలు ఎగ్జిట్ పోల్స్ ఎలా రూపొందిస్తారో తెలియని రాహుల్ గాంధీ.. ఫాంటసీ హాలిడేకు వెళ్లే సమయం వచ్చింది" అని ఎద్దేవా చేశారు. ఆశాభావంతో ఉండటం మంచిదే అయితే, ప్రధాని మోదీకి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదాన్ని పక్కన పెట్టలేరన్నారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న భాజపా మరోసారి పాలనా పగ్గాలు చేపట్టడం ఖాయమని, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి బాధ్యతలు స్వీకరించడం లాంఛనమేనని దాదాపుగా అన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఒకే అభిప్రాయాన్ని వ్యక్తంచేసిన నేపథ్యంలో సోనియా నుంచి స్పందన వచ్చింది.

## గోడ కూలి ఇద్దరు చిన్నారుల మృతి.. మరో ముగ్గురికి గాయాలు..



హైదరాబాద్: మైలార్ దేవ్‌పల్లి బాబుల్ రెడ్డి నగర్‌లో విషాదం చోటు చేసుకుంది. గోడకూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఉదయం 10 గంటల సమయంలో ఘటన చోటు చేసుకుంది. బీహార్, ఒడిశాకు చెందిన పలు కుటుంబాలు బాబుల్ రెడ్డి నగర్‌లో నివాసముంటున్నాయి. స్థానికంగా కంపెనీలో సదరు కార్మికులంతా పనిచేస్తున్నారు.

ఆయా కుటుంబాలకు చెందిన చిన్నారులు ఇంటి ముందు ఆడుకుంటుండగా గోడ ఒక్కసారిగా కూలిపోయింది. కూలిన గోడ శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో.. ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన చిన్నారులు నూర్జాన్, ఆసిఫ్ పర్వీన్ గా గుర్తించారు. ప్రమాద సమాచారం తెలుసుకుని మైలార్ దేవుపల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శిథిరాల కింద చిక్కుకున్న చిన్నారులను వెలికి తీసి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నాణ్యత లేకుండా నిర్మించిన గోడే ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు. రాత్రి కురిసిన చిన్న వర్షానికి గోడ తడిసి కూలిపోయింది. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660